# నగరగీతం

**చదవండి - ఆలోచించి చెప్పండి.**

చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్లు చెరుగుతున్నప్పుడు సంసారం బరువెంతో సమీక్షించగలిగినవాణ్ణి ఆకుపచ్చని చెట్టు, ఆహ్లాదభరితమైన వాతావరణమేమి లేకుండానే పగలూరాత్రి ఆస్బెస్టాస్ రేకులకింద పడి ఎంత వేడెక్కినా మాడిపోకుండా ఉండగల్గిన మానవాతీతుణ్ణి నరకప్రాయమైన నగరనాగరికతను నరనరానా జీర్ణించుకున్నవాణ్ణి రోజుకో రెండు కవితా వాక్యాల్ని రాయలేనా... అది మనకు పెన్నుతో పెట్టిన విద్య... అఫ్‌కోర్సు... కవిత్వం ఎంత నిత్యనూతనంగా వెలికి వచ్చినా రాసిన ప్రతిదీ ఆణిముత్యం కాదని అందరికి తెలుసు

– అలిశెట్టి ప్రభాకర్

## ప్రశ్నలు

1. "చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్ళు చెరుగుతున్నప్పుడు" వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?
2. కవి నివాసం ఎలా ఉంది?
3. నగర నాగరికతను నరకప్రాయమని కవి ఎందుకని ఉంటాడు? దానిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
4. కవితాత్మక వాక్యాలు చదివారు కదా! ఈ కవి గురించి మీకేమి అర్థమైంది?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ఆధునిక కాలంలో మనుషులంతా నగరాల్లో జీవించాలని కోరుకుంటున్నారు. మరోవైపు పల్లెల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో బతుకుతెరువుకోసం నగరాలకు వలసలు పెరిగిపోయాయి. నగరంలోని అనుకూలాంశాలన్నింటిని వినియోగించుకోవాలనే కోరికతో మనుషులు నగరంలో ఉండడానికి తాపత్రయపడుతున్నారు. దీనితో అనేక నగరాలు అత్యధిక జనాభాతో కిక్కిరిసిపోతున్నాయి. చాలా సమస్యలు పెరిగిపోయాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నగరం శరవేగంగా తన రూపం మార్చుకుంటున్నది. సామాన్యుడికి అందనంత దూరంగా కదిలిపోతున్నది నగరం. మధ్యతరగతికి అంతుచిక్కని ప్రాంతంగా మారిపోయింది నగరం. మనిషి యాంత్రిక స్థితిలోకి మారిపోతున్నాడు. తనకుతానే పరాయీకరణకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో నగరజీవితంలోని యథార్థదృశ్యాల్ని మన కళ్ళ ముందు నిలుపుతూ, నగరపు మరో పార్శ్వాన్ని చూపుతూ, వాస్తవాల్ని కఠినంగా నిర్వచించిన విధాన్ని తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం "మినీ కవిత" అనే ప్రక్రియకు చెందింది. ఏదైనా ఒక అంశాన్ని కొసమెరుపుతోనో, వ్యంగ్యంతోనో, చురకతోనో తక్కువ పంక్తుల్లో చెప్పడమే మినీ కవిత. 'అలిశెట్టి ప్రభాకర్' అనే గ్రంథంలోని 'సిటీలైఫ్' మినీ కవితలలో కొన్నిటిని 'నగరగీతం'గా కూర్చడమైంది.

## ప్రవేశిక

1. దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది.
   కొందరిని కొన్ని సన్నివేశాలు విశేషంగా ఆకర్షిస్తాయి.
   సహృదయుడు ప్రతి కదలిక నుంచీ ప్రేరణ పొందుతాడు.
   అతనికి భాష ఆయుధమైతే, భావం కవితారూపం సంతరించుకుంటుంది.
   నగరంలోని మూలలను, మూలాలనూ ఓ కవి హృదయం ఎట్లా దర్శించిందో – 'అలిశెట్టి' మినీ కవిత(లు) మన కళ్ళకు గడుతుంది.
   మనసు కిటికీ తెరిచి చూస్తే అక్షరాల వెనుక అనంత దృశ్యాలు కనిపిస్తాయి.

## I

**1 నుండి 5వ పంక్తి వరకు :**

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
నాలుగురోడ్ల కూడలిలో ఏమది?
అదే, నగరారణ్యహోరు
నరుడి జీవనఘోష

అర్థాలు :

| | | |
|---|---|---|
| నగారా | = | పెద్దఢంకా |
| నయాగరా | = | ఒక పెద్ద జలపాతం |
| కూడలి | = | రహదారులు కలిసే చోటు |
| హోరు | = | పెద్ద ధ్వని |
| జీవన ఘోష | = | బ్రతుకు గోల |

భావం : ఒక పెద్ద ఢంకా మ్రోగించినట్లుగా, పెద్ద జలపాతమైన నయాగరా దుమికినట్లుగా నాలుగుదారులు కలిసేచోట పెద్ద ధ్వని. అది నగరమనే అడవిలో బ్రతికే మనుషుల గొడవ. వాహనాల రణగొణధ్వనులు. రకరకాల సరుకులమ్మేవారి కేకలు. నగరంలో బ్రతికేవారి జీవన పోరాటపు ఆకలి కేకలవి.

విశేషాంశం : మూడు జలపాతాలను కలిపి నయాగరా జలపాతం అంటారు. ఇవి హార్స్ షూ ఫాల్స్, అమెరికన్ ఫాల్స్, బ్రైడల్ వీల్ ఫాల్స్‌లు అమెరికా వైపు ఉన్నాయి. హార్స్ షూ ఫాల్స్ – కెనడా వైపు ఉంది. ఇవి అన్నీ 50 మీటర్లు (165 అడుగులు) ఎత్తు నుండి పడతాయి.

6 నుండి 11వ పంక్తి వరకు :

తల్లి ఒడివంటి
పల్లెసీమల్నొదిలి
తరలివచ్చిన పేదరైతులూ
ఇనప్పెట్టెల్లాంటి
ఈ పట్టణాల్లో
ఊపిరాడని మీ బతుకులూ

అర్థాలు :

సీమ = ప్రాంతం

భావం : ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండే తల్లి ఒడిలాంటి పల్లెటూర్లను పేద రైతులు వదిలారు. ఇనపపెట్టెల్లాగ ఇరుకుగా ఉండే పట్టణాలకు వెళ్ళారు. అక్కడ ఇరుకు గదులలో ఊపిరాడకుండా బ్రతుకుతున్నారు. పల్లెటూరులోని స్వేచ్ఛ, ప్రశాంతమైన జీవితం పట్టణాలలో దొరకదు.

12 నుండి 15వ పంక్తి వరకు

నగరంలో ప్రతిమనిషి
పఠనీయ గ్రంథమే
మరి నీ బతుకు
పేజీలు తిరగేసేదెవరో!

అర్థాలు :

పఠనీయ గ్రంథం = చదవవలసిన పుస్తకం

భావం :నగరంలోని ప్రతి మనిషీ ఒక అధ్యయనం చేయవలసిన గ్రంథమే. అంటే ప్రతి వ్యక్తికి బాధలు, కష్టాలు, నష్టాలు, విషాదాలు అనేకం ఉంటాయి. అవీ వెలుగులోకి రావు. ఇక పల్లెటూరి నుండి కొత్తగా వెళ్ళిన వ్యక్తి గురించి పట్టించుకొనే వారెవరూ ఉండరు. అనాథలా బతకాలి.

16 నుండి 20వ పంక్తి వరకు

ఉదయమే
బస్సుల్లో రిక్షాల్లో
పేవ్‌మెంట్లపై విరబూసిన
కాన్వెంటు పువ్వుల సందడి
రాలే చదువుల పుప్పొడి!

అర్థాలు :

కాన్వెంటు పువ్వులు = కాన్వెంటు పిల్లలు

భావం : ఉదయమే బస్సుల్లోనూ, రిక్షాలలోనూ కాన్వెంట్లకు పిల్లలు బయలు దేరతారు. వాళ్ళ అమాయకపు ముకాలు అప్పుడే విరిసిన పువ్వులా ఉంటాయి. వారు బస్సుల కోసం పేవ్‌మెంట్లపై నిరీక్షిస్తూ, చదువుల గురించి మాట్లాడుకొంటారు. దీనినే 'రాలే చదువుల పుప్పొడి' అని కవి చమత్కరించాడు.

## II

**1 నుండి 5వ పంక్తి వరకు :**

సిటీ అంటే అన్నీ
బ్యూటీ బిల్డింగ్‌లు కావు
అటు భవంతులూ ఇటు పూరిళ్ళూ
దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!
ఇది వెరైటీ సమస్యల మనుఃఅష్ట్రఖు
సమ్మేళన కోలాహలం!

అర్థాలు :

పూరి + ఇల్లు = గుడ్డతో నేసిన పాక
సమ్మేళనం = కలయిక
కోలాహలం = కలకలం, సందడి

భావం : పట్టణం అంటే అన్నీ అందమైన పెద్ద పెద్ద భవనాలే కాదు. పేదల గుడిసెలూ ఉంటాయి. దారిద్ర్యం, ఐశ్వర్యం సమాంతర రేఖలలాగ ఉంటాయి. దరిద్రులకీ, ధనవంతులకీ మధ్య అంతరం అలాగే ఉంటుంది. పట్టణంలో మనుషులు తమాషాగా ఉంటారు. నవ్వు రాకపోయినా నవ్వుతారు. అందరూ కలసి ఉంటారు. ఎవరు ఎవరితోనూ మాట్లాడుకోరు. కష్టసుఖాలలో పాలుపంచుకోరు. అందుకే "ఇది వెరైటీ సమస్యల మనుష్యుల సమ్మేళన కోలాహలం'' అన్నాడు కవి.

**2 నుండి 20వ పంక్తి వరకు :**

ఎంతచేసినా ఎవరికీ
తీరిక దక్కదు కోరిక చిక్కదు
మెర్క్యూరీ నవ్వులు, పాదరసం నడకలు
కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడుకాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు!
నగరంలో అన్నిపక్కలా
సారించాలి మన చూపులు
మహానగరాల రోడ్లకి
మరణం నాలుగువైపులు!
నగరం మహావృక్షం మీద
ఎవరికి వారే ఏకాకి!
నగరం అర్థంకాని రసాయనశాల!
నగరం చిక్కువీడని పద్మవ్యూహం!!

అర్థాలు :

| | | |
|---|---|---|
| ఉన్నవాళ్లకి నాలుక్కాళ్ళు | = | నాలుగు చక్రాలతో నడిచే కారు |
| ఏకాకి | = | ఒంటరి |
| పద్మవ్యూహం | = | పద్మాకారంగా సైన్యాన్ని పన్నడం (ఇది ఒక సైనిక వ్యూహం) |

భావం : సాధారణంగా వారంలో 6 రోజులు పనిచేస్తే, ఒకరోజు ఆదివారం సెలవు వస్తుంది. కానీ, పట్టణాలలో ఎంత పనిచేసినా పని పూర్తికాదు. తీరిక చిక్కదు. అందుకు కారణం సెలవునాడు కూడా పనిచేస్తే డబ్బులు వస్తాయి. అవసరాలు గడుస్తాయి అని ఆశ. ఎంత సంపాదించినా ఖర్చులకే సరిపోతుంది. చిన్న చిన్న కోరికలు (కనీసం సినిమాకి వెళ్లడం వంటివి) కూడా తీరవు. నవ్వులలో ఆప్యాయత ఉండదు. గబగబా నడిచి వెడుతుంటారు. కొంతమంది కాలినడక వెడతారు. కొందరు రిక్షాపై వెళతారు. ధనవంతులు కార్లలో వెళతారు. ఎలా వెళ్లినా అన్నివైపులా చూసుకోవాలి. ప్రమాదాలెక్కువ. నగరంలో ఎవరి సమస్యలు వారివే. నగరం అర్థం కాని ప్రయోగశాల. అదొక పద్మవ్యూహం.

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గూర్చి మాట్లాడండి.

అ) మీరు ఇప్పటివరకు ఏఏ నగరాలను చూశారు? మీరు చూసిన నగరాల్లో మీకు నచ్చిన, నచ్చని అంశాలు తెలపండి?

ఆ) మీ ఊరి నుండి ఎవరైనా నగరాలకు వలస వెళ్ళారా? ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? వాళ్ళు అక్కడ ఏం చేస్తున్నారు?

2. పాఠం ఆధారంగా కింది కవితా పంక్తుల్లో దాగిన అంతరార్థాన్ని గుర్తించి రాయండి.

అ) నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే.

ఆ) నగరం మహావృక్షం మీద ఎవరికి వారే ఏకాకి.

ఇ) మహానగరాల రోడ్లకి మరనం నాలుగు వైపులు.

3. కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించండి.

అ) కుందుర్తి ఆంజనేయులు రచించిన వచన పద్య ఖండిక 'నగరంలో వాన' కవిత్వంలా మొదలై రాజకీయ శాసనంతో అంతం అవుతుంది. అందరూ వాస్తవికత నుంచి వ్యంగ్యాన్ని పుట్టిస్తే, ఇందులో కవి వ్యంగ్యం నుంచి వాస్తవికతను సృష్టిస్తాడు. ప్రబంధకవి అయ్యలరాజు రామభద్రుడు వర్షధార నుంచి కవితాధారను శ్లేషించాడు. అది కేవలం శబ్దగతమైన శ్లేషమాత్రమే. ఇందులో భావసంఘర్షణ నుంచి వెలువడిన వ్యంగ్యం గుబాళిస్తుంది. కవి భావుకత వ్యంగ్యధనువును ఎక్కుపెడితే, సంస్కారం వాస్తవికత భాగాన్ని గుండెలకు గురిపెట్టి కొడుతున్నది. ఆ దెబ్బ తప్పదు. అది ఎంత సున్నితంగా తాకుతుందో అంత గాఢంగా ముద్రవేస్తుంది. వచనపద్యం ఎంత సహజమైనదో, ఈ ఖండికలోని రచన కూడా అంత సహజంగా రూపు దిద్దుకొన్నది. కుందుర్తి వాన కురిసింది. నగరంలోనే అయినా, ఆ వానలో తడిసింది మాత్రం సామాన్యుడి జీవనమే! ఇందులో వాన కేవలం కేన్వాసు మాత్రమే. దాన్ని ఆధారం చేసుకుని కవి చిత్రించిన వాస్తవికదృశ్యాలు మనల్ని నిలబెట్టి ఆలోచింపజేస్తాయి.

అ) కవులు సామాన్యంగా వ్యంగ్యాన్ని ఎలా సృష్టిస్తారు?

ఆ) అయ్యరాజు రామభద్రుడి కవితాధారను విశ్లేషించండి.

ఇ) కుందుర్తి నగరంలోవాన కవితను ఏ శైలిలో రాశాడు?

ఈ) నగరంలో వాన కవితలోని ప్రధానాంశం ఏమిటి?

ఉ) కుందుర్తి వాస్తవికత ఎలాంటిది?

4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.
అ) అలిశెట్టి ప్రభాకర్ కవితాదృక్పథం ఏమిటి?
ఆ) 'నగరగీతం' రాయడానికి గల నేపథ్యాన్ని వివరించండి.
ఇ) నరుడి జీవనఘోష కవికి ఎలా వినిపించింది?
ఈ) నగరంలో దారిద్ర్యం, సౌభాగ్యం ఏ విధంగా కనిపిస్తాయి?
ఉ) అలిశెట్టి ప్రభాకర్ 'సిటీలైఫ్' కవితల ప్రత్యేకత ఏమిటి?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.
అ) నగరం అంటే ఏమిటి? పల్లెకు – నగరానికి గల ప్రధాన వ్యత్యాసం తెలపండి.
జ. నగరం అంటే పెద్ద పట్టణం.
నగరం : ఇక్క జనాభా ఎక్కువ. సదుపాయాలు ఎక్కువ. జీవన వ్యయం చాలా ఎక్కువ. కాలుష్యం ఎక్కువ. మనుష్యుల మధ్య అంతరాలు ఎక్కువ. ఎవరి స్వార్థం వారిది. ఉద్యోగులు, ధనవంతులు ఎక్కువ విలాసవంతంగా ఉంటారు.
పల్లెటూరు : జనాభా తక్కువ. సదుపాయాలు తక్కువ. జీవన వ్యయం తక్కువ. కాలుష్యం ఉండదు. మనుష్యుల మధ్య ప్రేమాప్యాయతలు ఎక్కువ. కష్టసుఖాలలో పాలుపంచుకొంటారు. ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. విలాసవంతమైన జీవితం ఉండదు.
ఆ) 'నగరజీవికి తీరిక దక్కదు కోరిక చక్కిద'నే పంక్తుల్లోని వాస్తవాన్ని వివరించండి.
జ. నగరంలో పనిచేసే చోటు దూరంగా ఉంటుంది. తన నివాసం నుండి అక్కడకు వెళ్ళి రావడంతో సమయమంతా అయిపోతుంది. అందుచేత నగర జీవికి తీరిక దక్కదు.
ఎంత సంపాదించినా నగరంలో జీవన వ్యయానికే సరిపోదు. ఇంటి అద్దె, పాలు, బియ్యం మొదలైన ఖర్చులు, ప్రయాణపు ఖర్చులు. చివరకు పైసా మిగలదు. సరదాగా హెూటల్‌కు వెడదామన్నా, సినిమా చూద్దామన్నా కూడా డబ్బులుండవు. అంటే చిన్ని చిన్న కోరికలు కూడా తీరవు.

ఇ) ఈ పాఠం ఆధారంగా నగరం ఎలా ఉంటే కవికి నచ్చుతుందో తెలపండి.
జ. నగరంలో రణగొణ ధ్వనులు ఉండకూడదు. ప్రశాంతంగా జీవనం సాగాలి. విశాలమైన ఇళ్ళు ఉండాలి. చక్కని గాలి రావాలి. ఎవరి ఇల్లు వారికి ఉండాలి. నగరంలోని వారు, ప్రక్కవారిని గురించి తెలుసుకోవాలి. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండాలి.
పిల్లలు కాన్వెంటులకు హడావిడిగా బస్సుల ప్రయాణాలు, రిక్షా ప్రయాణాలు మాని, స్వేచ్ఛగా రహదార్ల వెంట పాఠశాలలకు నడచివెళ్ళాలి.
నగరంలో చక్కని భవనాలు ఉండాలి. సమస్యలు లేని జీవనం సాగాలి. సౌభాగ్యంగా జీవించాలి.
ప్రజలు హడావిడి లేని ప్రశాంత జీవనం సాగించాలి. ప్రజల కోరికలు తీరాలి. ప్రజలు నిండుమనస్సుతో ఒకరినొకరు పలకరించుకోవాలి.
రోడ్డు ప్రమాదాలు లేకుండా ఉండాలి. ప్రజలంతా కలసిమెలసి జీవించాలి. ప్రజలు సుకంగా ఒకరినొకరు అర్థం చేసుకొని హాయిగా జీవించాలి. ఈ విధంగా ఉంటే కవికి నచ్చుతుంది.

ఈ) నగరజీవితంలోని ప్రతికూల అంశాల్ని ఇంత కఠినంగా వర్ణించడంలో కవి ఆంతర్యం ఏమిటి?
జ. తన జీవితమే తన కవిత్వంలో వ్యక్తమవుతుంది. కవికి నగరంలో చాలా చేదు అనుభవాలు ఎదురై ఉంటాయి. దుర్భర దారిద్ర్యం అనుభవించి ఉంటాడు. ప్రమాదాలలో నష్టం జరిగి ఉండవచ్చు. మొత్తం మీద కవి నగరంలోనే ఉంటూ నగర జీవితమంటే అసహ్యం కలిగే సంఘటనలు అనుభవించి ఉండవచ్చు. అందుకే నగర జీవితంలోని ప్రతికూల అంశాల్ని కఠినంగా వర్ణించాడు.

ఉ) నగరంలో మనిషి జీవనవిధానాన్ని పాఠం ఆధారంగా వివరించండి.
జ. నగరం వలస వెళ్ళిన వారిని ఎవరూ పట్టించుకోరు. చాలా బాధలు పడాలి. సందడిగానే ఉంటుంది. కాని పేద రైతులకు సమస్యలతో ఊపిరి సలపదు. నగరంలోని ప్రతి మనిషికీ ఏదో సమస్యే, హడావుడి బ్రతుకులు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ. భద్రత లేదు.

ఊ) అందరూ నగరాల్లో జీవించాలని ఎందుకు అనుకుంటున్నారు?
జ. నగరాలలో ఏదో ఒక పని దొరుకుతుంది. డబ్బు సంపాదించవచ్చు. హాయిగా విలాసాలు అనుభవించవచ్చును. సుఖంగా జీవించవచ్చును. వైద్యం అందుబాటులో ఉంటుంది. పిల్లల చదువులకు విద్యాలయాలు చాలా ఉంటాయి. అన్ని రకాల చదువులూ ఉంటాయి. ఉపాధి అవకాశాలు ఎక్కువ..... మొదలగు ఆలోచనలతో చాలా మంది నగరాలలో జీవించాలని కోరుకుంటారు.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.
అ) 'నగరగీతం' సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
జ. 'నగరగీతం' అలిశెట్టి ప్రభాకర్ రచన.
నగారా మ్రోగినట్లు, నయాగరా జలపాతం దుమికినట్లు నగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో హడావుడిగా ఉంటుంది. నగరారణ్యంలో బ్రతుకు తెరువు కోసం నరుల ఘోష అది. చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారి కేకలు, రిక్షాలు, కార్లు, పాదచారులు, బస్సుల హడావుడి ఎక్కువగా ఉంటుంది.
పల్లెటూరు తల్లి ఒడిలాంటిది. ప్రశాంతమైనది. కాలుష్యం లేనిది. అటువంటి పల్లెటూళ్ళు వదిలి పేదరైతులు నగరాలకు చేరుతున్నారు.

అక్కడ బ్రతకలేక విలవిలలాడుతున్నారు. నగరంలో ప్రతి మనిషికీ సమస్యలే. ఇక ఈ వలస జీవులను పట్టించుకొనేదెవరు.

ఉదయమే రిక్షాలలో, బస్సులలో కాన్వెంటు పిల్లల హడావుడి, వారి ముఖాలు అప్పుడే విరిసిన పువ్వులులాగ ఉంటాయి. వారి ముఖాలనే పూల నుండి చదువులనే పుప్పొడి రేణువులు పేవ్‌మెంట్లపై రాల్తాయి.

సిటీ అంటే అందమైన భవంతులే కాదు, పూరిళ్ళు ఉంటాయి. దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలులా ఉంటాయి. నగరం ఒక విచిత్రమైన సమస్యలు గల మనుషుల కలయికతో నిండి ఉంటుంది. ఎంత పని చేసినా కడుపే నిండదు. ఒక్క సెకను కూడా తీరిక దొరకదు.

అక్కడ అందరివీ కల్పితమైన నవ్వులు. తెచ్చి పెట్టుకొన్న మర్యాదలు, వేగవంతంగా నడిచి వెళ్ళేవారు కొందరు. కొందరు కార్లపై వెడతారు. కొందరు రిక్షాలలో వెడతారు. ఎవరు ఎలా వెళ్ళినా నాలుగు వైపులా చూసుకోవాలి. లేదా రోడ్డు ప్రమాదాలలో నష్టపోవలసి వస్తుంది.

నగరంలో ఎవరి బ్రతుకు వారిదే. ఒంటరి జీవితం. అదొక అర్థంకాని ప్రయోగశాల. అదొక దారి తెలియని పద్మవ్యూహం.

ఆ) నేడు నగరజీవనం ఎందుకు సంశ్లిష్టంగా మారిందో విశ్లేసించండి.

జ. నగరంలో జనాభా పెరిగిపోయింది. పల్లెటూళ్ళ నుండి నగరాలకు పనుల కోసం చాలామంది వలస వచ్చేస్తున్నారు. పల్లెటూళ్ళలోని ఆస్తిపరులు కూడా ఆస్తులను అమ్మి, విలాసాల కోసం నగరాలకు ఎగబడుతున్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ, వైద్య సదుపాయాలన్నీ నగరాలలో కేంద్రీకృతమైపోయాయి. ఆయా అవసరాల నిమిత్తం నగరాలకు వెడుతున్నారు.

జనాభా పెరగడంతో అవసరాలు పెరిగాయి. కాలుష్యం పెరిగింది. సమస్యలు పెరిగాయి. శాంతి భద్రతల సమస్య పెరిగింది. పోటీ పెరిగింది. వ్యాపారాలు పెరిగిపోయాయి. జీవన వ్యయం పెరిగింది.

ఇన్ని గందరగోళాల మధ్య మానవుడికి కావలసిన మనశ్శాంతి కొరవడింది. జీవితంలో ప్రశాంతత లేదు. కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోయాయి. జీవితాన్ని మందులతో వెళ్ళదీసే పరిస్థితి ఏర్పడింది.

ఎటుచూసినా సమస్యలే. రోడ్లన్నీ కిక్కిరిసిపోయి ఉంటాయి. ఈ పరిస్థితులలో నగర జీవితం సంక్లిష్టంగా మారింది. కేవలం బ్రతకాలి కనుక బ్రతికే వారి సంఖ్య నగరాలలో పెరిగిపోతోంది.

ఇ) నగరాన్ని రసాయనశాలగా, పద్మవ్యూహంగా వర్ణించడంలోని నిజానిజాల గురించి చర్చించండి.

జ. రసాయనశాలలో అనేక ద్రావణాలు, ఆమ్లాలు, క్షారాలు మొదలైనవి ఉంటాయి. వాటితో ప్రయోగాలు చేయడానికి పరికరాలు ఉంటాయి. రకరకాల రసాయన పదార్థాలతో రకరకాల ప్రయోగాలు చేస్తారు. రసాయన చర్య జరిగి కొత్త పదార్థాలు తయారౌతాయి. పట్టణం కూడా అంతే. పట్టణాలలోని ఆఫీసులలో, కర్మాగారాలలో జరిగే పనులలో సహాయపడే పేదవారిని ద్రావణాలు, ఆమ్లాలు, క్షారాలు మొదలైన వాటితో పోల్చవచ్చు. ఆఫీసు ఫైళ్ళు, పనులు, ఇక్కడ ప్రయోగ పరికరాలు. రసాయనశాలలోని పదార్థాలకు జీవం ఉండదు. అలాగే పట్టణంలోని పనులలో కూడా యాంత్రికత తప్ప మానవత్వం, దయ, ప్రేమ ఉండవు. యాంత్రికంగా జీవించలేని పల్లెటూరి వారు మనసారా జీవిస్తారు. వారికి పట్టణ జీవితం పనికిరాదు. అందుకే రసాయనశాలతో పోల్చాడు కవి.

పద్మవ్యూహం అంటే పద్మం ఆకారంలో సైన్యాన్ని పన్నే ఒక సైనిక వ్యూహం, దీనిని కౌరవ పాండవ యుద్ధంలో ద్రోణాచార్యుడు పన్నాడు. దీనిలోకి ప్రవేశం విరమణ తెలిసినవారు కృష్ణుడు, అర్జునుడు, ద్రోణుడు, ప్రద్యుమ్నుడు మాత్రమే ఉన్నారు. అభిమన్యుడికి పద్మవ్యూహంలోకి ప్రవేశించడం తెలుసు కాని బయటకు రావడం దానిని ఛేదించడం తెలియదు. అందుకే పద్మవ్యూహంలో అభిమన్యుడు మరణించాడు.

పట్టణంలోని రోడ్లు కూడా పద్మవ్యూహం వంటివే. ఎటువెళ్లాలో తెలియదు. ఎలా వెళ్ళాలో తెలియదు. అక్కడ మోసం ఎక్కువ. మనుషుల స్వభావాలు తెలియవు. అంతా గజిబిజిగా, గందరగోళంగా ఉంటుంది. అందుకే పట్టణం వెళ్ళిన పల్లెటూరివారు అభిమన్యుడిలా గిలగిలలాడాలి. అందుకే పట్టణాన్ని పద్మవ్యూహం అన్నాడు కవి.

3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.

అ) నగరగీతం కవితకు మరో పార్శ్వంగా నగర జీవనంలోని అనుకూల అంశాలపై ఒక వ్యాసం రాయండి.

జ. నగరం విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. ఏ చదువైనా చదువుకోవచ్చును. ఉద్యోగం చేసుకుంటూ కూడా చదువుకోవచ్చును. విద్యాలయాలకు వెళ్ళడానికి కూడా సిటీబస్సులు, ఆటోలు ఉంటాయి. నివాసానికి, భోజనానికి హాస్టల్స్ ఉంటాయి.

విద్య పూర్తయ్యాక ఉపాధి దొరుకుతుంది. ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకోవచ్చును. అవసరమైతే ఓవర్‌టైమ్ కూడా చేసుకొని డబ్బు సంపాదించవచ్చును. సుఖంగా జీవించవచ్చును. వ్యాపారమైనా చేయవచ్చును. పనికీ సంపాదనకూ లోటుండదు.

వైద్య సదుపాయం ఉంటుంది. చాలా ఆసుపత్రులు ఉంటాయి. ఎండ, చలి, వాన కూడా తెలియకుండా సౌఖ్యాలు అనుభవించవచ్చును. భూలోక స్వర్గాలంటే నగరాలే. కలలో కూడా ఊహించలేని సౌఖ్యాలనుభవించవచ్చును.

ఆ) ప్రశాంతతకు, పచ్చదనానికి నిలయమైన పల్లెల గొప్పదనాన్ని వర్ణిస్తూ ఒక వచన కవితను రాయండి.

జ. *పక్షుల కిలకిలలే పల్లెకు మేలుకొలుపు*
*పాలనురుగులాంటి లేగదూడల గెంతులే కనుల విందు*
*పచ్చపచ్చని పైరులే పల్లె తల్లికి పట్టుచీర కొంగు*
*చల్ల చల్లని పైరగాలి రెపరెపలే మనసుకు పసందు*
*కిర్రు చెప్పులు, నాగలి కర్రుల సందడే సందడి*

*అనురాగం, ఆప్యాయత కలబోసిన పలకరింపుల పులకింతలు*
*పల్లెకు సాటి మల్లె వంటి చల్లని తల్లి మనసే.*

## III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలకు అర్థాలను 'పదవిజ్ఞానం'లో వెతికి ఆ అర్థంతో సొంతవాక్యాలు రాయండి.
ఉదా॥ ఏకాకి = ఒంటరి
అభిమన్యుడు పద్మవ్యూహంలో ఏకాకి అయినాడు.
అ) నగారా = పెద్ద ఢంకా
పూర్వకాలంలో యుద్ధప్రారంభానికి, ముగింపుకు గుర్తుగా నగారా మ్రోగించేవారు.
ఆ) హోరు = పెద్ద ధ్వని
తుఫానులో సముద్రపు హోరు మా ఇంటికి వినిపిస్తుంది.
ఇ) ఘోష = ఉరుము (పెద్ద ధ్వని)
వర్షాకాలంలో ఘోషలు, మెరుపులు వస్తాయి. వెంటనే పిడుగులు వస్తాయి.
ఈ) ఊపిరాడని = గాలి పీల్చుకోడానికి వీలుకాని
నాకు నగరంలో ఊపిరరాడని పనులు ఉన్నాయి.
ఉ) పఠనీయ గ్రంథం = చదవదగిన పుస్తకం.
తెలుగు సాహిత్యంలో పఠనీయ గ్రంథాలు చాలా ఉన్నాయి.

2. కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.
ఉదా॥ పల్లె – గ్రామం, జనపదం
<u>పల్లెలే</u> దేశానికి పట్టుగొమ్మలు అని <u>గ్రామ</u> స్వరాజ్యంకోసం గాంధీజీ కలలు కన్నారు. జనపదాన్ని బాగుపరచడమే దేశ సౌభాగ్యంగా తలచారు.
అ) నరుడు – మానవుడు, మర్త్యుడు
నరుడు, వానరుడి నుండి పుట్టాడని మానవుడు నిరూపించాడు. మర్త్యుడు తన మేధతో అద్భుతాలు సృష్టించాడు.
ఆ) అరణ్యం – అడవి, విపినం
అరణ్యంలో చాలా వృక్షాలు ఉంటాయి. అడవిలో చాలా మూలికలు ఉంటాయి. అందుకే విపినంను సంరక్షించాలి.
ఇ) రైతు – హాలికుడు, కర్షకుడు
పంటలు పండించే హాలికుడు దేశానికి వెన్నెముక. ఆ కర్షకుని కష్టం వెలకట్టలేనిది. అందుకే రైతు కు దేశం ఋణపడి ఉంటుంది.
ఈ) పువ్వు – కుసుమం, లతాంతం
జాజి పువ్వు, మల్లె కుసుమం, చేమంతి లతాంతం అన్నీ సువాసనా భరితాలే.
ఉ) మరణం – మృతి, చావు
భర్త మరణం, కొడుకు మృతి, ఎందరికో చావును తెచ్చే యుద్ధం వద్దు. శాంతి ముద్దు.
ఊ) వాంఛ – కోరిక, ఆకాంక్ష
ఉన్నతమైన వాంఛ నెరవేరాలనే కోరికతో నా ఆకాంక్షను చెప్పాను.
ఎ) వృక్షం – తరువు, భూజము
వృక్షం పెంచితే ఆతరువు నిన్ను పెంచుతూ ఆభూజము తల్లిలాగ కాపాడుతుంది.

### వ్యాకరణాంశాలు

1. కింది కవితా భాగాల్లోని అలంకారాన్ని గుర్తించండి.

అ) నగారా మోగిందా
నయాగరా దుమికిందా

ఆ) రంగదరాతిభంగ; ఖగరాజతురంగ; విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ; పరితోషితరంగ; దయాంతరంగ; స
త్సంగ; ధరాత్మజా హృదయ సారస భృంగ; నిశాచరాబ్జ మా
తంగ; శుభాంగ! ....

ఇ) కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడు కాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు

శబ్దాలంకారాల్లో వృత్త్యనుప్రాస, అంత్యానుప్రాస లాంటివే మరికొన్ని ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

1. ముక్తపదగ్రస్తం

కింది పద్యాన్ని పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

కం. మన వేటికి నూతనమా!
తనమ మానినిఁ బ్రేమఁ దనకుఁ దక్కితిననుమా
నను మానక దయ దనరం
దనరంతులు మాని నరసధవు రమ్మనవే.

పై పద్యంలోని ప్రత్యేకతను గమనించారు కదా!

ఒక పద్యపాదంగాని, వాక్యంగానీ ఏ పదంతో పూర్తవుతుందో అదే పదంతో తర్వాత పాదం / వాక్యం మొదలవుతుంది. దీన్నే ముక్తపదగ్రస్త అలంకారం అంటారు.

2. యమకము

కింది వాక్యాలు పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

అ) లేమా! దనుజుల గెలువఁగలేమా
(లేమ = స్త్రీ, గెలువగలేమో = గెలువడానికి మేమిక్కడ లేమా (ఉన్నా కదా!))

ఆ) ఆ తోరణం శత్రువులతో రణానికి కారణమైంది.
(తోరనం = ద్వారానికి కట్టే అలంకారం; రణం = యుద్ధం)

పై రెండు సందర్భాల్లోనూ ఒకే పదం అర్థభేదంతో ప్రయోగించడం జరిగింది. దీనినే 'యమకాలంకారం' అంటారు.

3. లాటానుప్రాస

కింది కవితా భాగాలను / వాక్యాలను చదవండి. ప్రత్యేకతను గమనించండి.

అ) హరి భజియించు హస్తములు హస్తములు.....(చేతులే, నిజమైన చేతులు)

ఆ) చిత్తశుద్ధితో జేసెడి సేవ సేవ. (సేవయే నిజమైన సేవ)

పై రెండు సందర్భాల్లోనూ ఒకే పదం అర్థంలో తేడా లేకున్నా భావంలో తేడా ఉండేటట్లు ప్రయోగించారు. ఈ విధంగా ఒకే పదాన్ని, అర్థం ఒకటే అయినా తాత్పర్యభేదంతో ప్రయోగించడాన్ని 'లాటానుప్రాసాలంకారం' అంటారు.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

భారతదేశంలోని ప్రధాననగరాల వివరాలు వాటి ప్రత్యేకతలు, జీవన విధానాల వైవిధ్యాన్ని సేకరించి ఒక పట్టికగా రూపొందించి 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' నిరూపించేలా ప్రదర్శించండి.

**సంధులు :**

1) సవర్ణదీర్ఘసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) నగరారణ్యం | = | నగర | + | అరణ్యం | - | సవర్ణదీర్ఘసంధి |
| 2) సమాంతర రేఖలు | = | సమ | + | అంతర రేఖలు | - | సవర్ణదీర్ఘసంధి |
| 3) చైత్రారంభం | = | చైత్ర | + | ఆరంభం | - | సవర్ణదీర్ఘసంధి |

2) ఇకారసంధి (ఇత్వసంధి) :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) ఊపిరాడని | = | ఊపిరి | + | ఆడని | - | ఇత్వసంధి |
| 2) పూరిల్లు | = | పూరి | + | ఇల్లు | - | ఇత్వసంధి |

**సమాసాలు :**

| | సమాసపదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| 1) | నాలుగు రోడ్లు | - నాలుగు సంఖ్య గల రోడ్లు | - ద్విగు సమాసం |
| 2) | రెండు కాళ్ళు | - రెండు సంఖ్య గల కాళ్ళు | - ద్విగు సమాసం |
| 3) | మూడు కాళ్ళు | - మూడు సంఖ్య గల కాళ్ళు | - ద్విగు సమాసం |
| 4) | నాలుగు కాళ్ళు | - నాలుగు సంఖ్య గల కాళ్ళు | - ద్విగు సమాసం |
| 5) | నాలుగు వైపులు | - నాలుగు అయిన వైపులు | - ద్విగు సమాసం |
| 6) | రోడ్లకూడలి | - రోడ్ల యొక్క కూడలి | - షష్ఠీ తత్పురుష సమాసం |
| 7) | పుప్పొడి | - పూల యొక్క పొడి | - షష్ఠీ తత్పురుష సమాసం |
| 8) | సమ్మేళన కోలాహలం | - సమ్మేళన మందలి కోలాహలం | - సప్తమీ తత్పురుష సమాసం |
| 9) | నగరారణ్యం | - నగరం అనే అరణ్యం | - రూపక సమాసం |
| 10) | జీవన ఘోష | - జీవనం యొక్క ఘోష | - షష్ఠీ తత్పురుష సమాసం |
| 11) | పేదరైతులు | - పేదవారైన రైతులు | - విశేషణ పూర్వపద కర్మధారయం |
| 12) | సమాంతర రేఖలు | - సమాంతరమైన రేఖలు | - విశేషణ పూర్వపద కర్మధారయం |
| 13) | వెరైటీ సమస్యలు | - వెరైటీ అయిన సమస్యలు | - విశేషణ పూర్వపద కర్మధారయం |

* * *